క్లుప్తంగా

డెంగీ నివారణకు విస్తృత చర్యలు



గన్నవరంరూరల్: పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకోవడం ద్వారా డెంగీ వ్యాధిని అరికట్టవచ్చని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని తెంపల్లి గ్రామంలో జాతీయ డెంగీ మాసోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పంచాయతీ కార్యదర్శి రాజేష్‌తో కలిసి సున్నం, బ్లీచింగ్ చల్లించారు. నిల్వ ఉన్న నీటిని గుర్తించటం, వాటిని శుభ్రపరచటం, నీటి నిల్వలపై మూతలు వేయటం, అనవసర వృథా నీరు నిల్వ ఉన్న వస్తువులు తొలగించటం చేయటంతో పాటు దోమల పెరుగుదలకు ఉపయోగపడే అన్ని మార్గాలు మూసివేయాలని గ్రామస్తులకు సూచించారు. చెత్త, వ్యర్థాలు ఆరుబయట వేయవద్దన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, వణుకు, అలసట, దద్దుర్లు డెంగ్యూ వ్యాధి లక్షణాలని, ఈ లక్షణాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పెనమలూరు: విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో మెలగాలని ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలానీ అన్నారు. విజయవాడ ఎన్‌సీసీ గ్రూప్ ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో ఉత్తమ అసోసేట్ ఎన్‌సీసీ అధికారి, పీఐ సిబ్బంది, జీసీఐలు, ఎన్‌సీసీ క్యాడెట్ల అవార్డుల ప్రధాన మహోత్సవం బుధవారం జరిగింది. పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన ఎన్‌సీసీ అధికారి, క్యాడెట్లు జాతీయ స్థాయిలో థాల్ సైనిక్ శిబిరంలో సత్తాచాటి స్వర్ణపతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉత్తమ ఎన్‌సీసీ అసోసేట్ అధికారిగా పీవీపీ కాలేజీకి చెందిన ఎన్‌సీసీ అధికారి ఎం.ధాదుర్యానాయక్‌కు, ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్‌గా కె.సాయివరుణ్‌తేజ పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు పాల్గొన్నారు.

రేపు యనమలకుదురు ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో ఆలయ హుండీ కానుకల లెక్కింపు జరుపనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.భవాని తెలిపారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 9 గంటలకు ఆలయంలోని 9 హుండీలను అధికారుల సమక్షంలో తెరిచి లెక్కిస్తామన్నారు. ఆలయ సిబ్బందితో పాటు విజయవాడకు చెందిన శివసాయి సంఘం సభ్యులు హుండీ కానుకల లెక్కింపులో పాల్గొంటారని ఈవో చెప్పారు.

కళాకారులు కులమతాలకు అతీతులు



విజయవాడకల్చరల్: కళాకారులు కులమతాలకు అతీతులని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. కళామంజరి సాంస్కృతిక సేవా సమితి, సి.రామ్మోహన రావు కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సినీ నటుడు, నిర్మాత, దర్శకుడు ఎస్వీ రంగారావు 107వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుప్తా మాట్లాడుతూ నవరస నటుడు ఎస్వీఆర్ అని అభివర్ణించారు. కళామంజరి వ్యవస్థాపకుడు పీవీఎల్ నృసింహం మాట్లాడుతూ ఎస్వీఆర్ ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడని కొనియాడారు. ఆయన నటించిన నర్తనశాల చిత్రం అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శించినట్లు తెలిపారు. వివిధ రంగాలకు చెందిన అల్లూరి మార్కండేయ రాజు, హరగోపాల్ పాల్గొన్నారు. అతిథులు ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు.

10న శాకంబరీదేవి ఉత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో 10వ తేదీన శాకంబరీదేవి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్ శర్మ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉత్సవాల వివరాలను ప్రకటించారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ సారె సమర్పణ జరుగుతుందన్నారు. ఈనెల 6వ తేదీ శ్రీగణపతి సేవా సమితి ఆధ్వర్యంలో గాజుల విజయలక్ష్మీ బృందంచే అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 10వ తేదీ అమ్మవారితో పాటు స్వామి వారిని, ఉపాలయాల్లో కొలువై ఉన్న దేవతా మూర్తులను కాయగూరలు, ఆకుకూరలతో అలంకరిస్తారన్నారు.

భవన నిర్మాణాల్లో నిబంధనలు బేఖాతరు!

- హైటెన్షన్ టవర్ లైన్ కింద యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- అక్రమార్కులకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల వత్తాసు
- ఫిర్యాదు చేసినా చర్యలు నిల్
- ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన
- చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



విద్యుత్ టవర్ లైన్ కింద నిర్మిస్తున్న ఐదు అంతస్తుల భవనం



భవనాలపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చట్టాలు సక్రమంగా అమలు కావటం లేదు. ఇక్కడ అక్రమార్కులదే రాజ్యంగా ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ సంపాదన కోసం బిల్డర్లు, మధ్యవర్తులు కలిసి అనేక అక్రమాలు చేస్తుంటే వారికి మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా యనమలకుదురు గ్రామంలో ఏకంగా విద్యుత్ హైటెన్షన్ టవర్ లైన్‌కింద అక్రమ భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళితే యనమలకుదురులో కొండ వెనుక విద్యుత్ శాఖకు చెందిన హైటెన్షన్ టవర్ లైన్ ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టవర్ లైన్ కింద ఎటువంటి భవనాల నిర్మాణం చేయకూడదు. హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో ప్రతి నిత్యం ప్రమాదం పొంచి ఉంటోంది.

జీవో 119 ఏమి చెబుతుందంటే...

విద్యుత్ టవర్ హైటెన్షన్ లైన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2017 సంవత్సరంలో జీవో 119 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం విద్యుత్ టవర్ లైన్‌కు 10 మీటర్ల వరకు ఎటువంటి భవనాలు నిర్మాణం చేయకూడదు. పైగా టవర్‌లైన్ కింద గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయాలి. టవర్ లైన్‌కు 10 మీటర్ల దూరంలోనే రోడ్లు నిర్మాణం చేయాలి. ప్రభుత్వం జీవోలో స్పష్టంగా మార్గదర్శకాలు నిర్దేశించింది. అయితే యనమలకుదురులో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వ జీవో అమలు చేయని పరిస్థితి.

యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణం..

యనమలకుదురులో టవర్‌లైన్ కింద అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. తాడిగడప మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతికి తెరలేపారు. టవర్ లైన్‌కింద రెండు భవనాలకు అనుమతులు ఇచ్చారు. ఒక్కో భవనానికి మూడు ఫ్లోర్‌లు అనుమతులు మంజూరు చేశారు. ఈ ప్లాన్‌లు చట్ట విరుద్ధంగా మంజూరు చేశారు. పైగా బిల్డర్ ఏకంగా ఐదు ఫ్లోర్లతో టవర్ లైన్ కిందే బహుళ అంతస్తులు నిర్మిస్తున్నాడు. మొత్తం 40 ప్లాట్‌లు టవర్‌లైన్ కిందే నిర్మాణం చేస్తున్నాడు. ప్రభుత్వ జీవో 119 మార్గదర్శకాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తుంగలో తొక్కారు. ఈ నిర్మాణలపై స్థానికులు ఫిర్యాదులు కూడా చేశారు. తూతూమంత్రంగా టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. అయితే నిర్మాణాలు ఆగలేదు. ఇటీవల భవన నిర్మాణ కార్మికుడు పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు వదిలాడు. ఇటువంటి ప్రమాదాలు పొంచి ఉన్నా తాడిగడప మున్సిపాలిటీలో అక్రమాలు పతాకస్థాయికి చేరాయని చెప్పటానికి ఈ నిర్మాణం ఉదాహరణగా ఉంది.

అక్రమాలకు అడ్డా..

తాడిగడప మున్సిపాలిటీ అక్రమార్కులకు అడ్డాగా మారింది. ప్రధానంగా భవన నిర్మాణాల ప్లాన్‌లు, అక్రమ లేఅవుటుల దందా కొనసాగుతోంది. టార్గెట్‌లు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా నూతన భవన నిర్మాణం చేపట్టగానే అధికార పార్టీ ఏజెంట్లు కలెక్షన్‌ల కోసం రంగంలోకి దిగుతున్నారు. వీరికి తాడిగడప మున్సిపాలిటీ అధికారుల సహాయ సహకారాలు పుష్కలంగా ఉంటున్నాయి. ఇక్కడ చట్టాలు, న్యాయం, నిబంధనలతో పని లేదు. అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలను మోసం చేస్తూ బిల్డర్లు, మున్సిపాలిటీ అధికారులు, అధికార పార్టీ నేతలు కాసులు వెనకేసుకుంటున్నారు. అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ టవర్ లైన్ల కింద చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు, ఆత్కూరు, పెద్దఆవుటపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుడివాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వ్యవసాయ శాఖ సహాయకుల బదిలీలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలో వ్యవసాయ శాఖ సహాయకులను ప్రభుత్వం బదిలీలు చేసింది. మండలంలో మొత్తం 16 మంది సహాయకులుండగా వారిని ఏడుగురికి తగ్గించి(రేషనలైజేషన్) బదిలీలు చేసింది. ఆ ప్రకారం నున్న గ్రామంలో ముగ్గురు సహాయకులకు గాను ఇద్దరిని మాత్రమే నియమించింది. నున్న 1, 2 సచివాలయాలకు గాను కొలిపాక విజయలక్ష్మి, నున్న 3 సచివాలయానికి నియామకం జరగలేదు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాలకు శ్రావణి, నిడమానూరు, దోనేఆత్కూరు గ్రామాలకు పాముల ఏస్తేరు, గూడవల్లి గ్రామానికి కె.గోపిరాజు, గొల్లపూడి, రాయనపాడు గ్రామాలకు పి.నాగ ఫణిశ్రీ, కొత్తూరు తాడేపల్లి గ్రామానికి యు.అక్షయ్ కుమార్, జక్కంపూడి, పైడూరుపాడు గ్రామాలకు పి.సంజయ్ పవన్ కుమార్, పి.నైనవరం, పాతపాడు, అంబాపురం గ్రామాలకు వ్యవసాయ శాఖ సహాయకులను నియామకం చేయలేదు.

పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మల్లవల్లిలో గొర్రెలకు మందులు వేస్తున్న ఏడీ ప్రమీలారాణి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వర్షాకాలంలో పశువుల కాళ్లకు తరుచుగా వచ్చే తెగుళ్ల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని పశుసంవర్ధకశాఖ బాపులపాడు ఏడీ డాక్టర్ ఎం.ప్రమీలారాణి చెప్పారు. జీవాల్లో నట్టల వ్యాధి నివారణకు బాపులపాడు మండలం మల్లవల్లిలో గురువారం చేపట్టిన ఉచిత మందు పంపిణీ కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కట్టుబోయిన జలలయ్య, చాకిరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఏడీ డాక్టర్ ఎం.ప్రమీలారాణి మాట్లాడుతూ నట్టల వ్యాధి వల్ల కలిగే నష్టాలను, నట్టల వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుపోషకులకు వివరించారు. వర్షాకాలంలో పశువుల కాళ్లకు సోకే వ్యాధులు, నియంత్రణ చర్యలను ఆమె తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పశువుల బీమా, పావలా వడ్డీ రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డు వివరాలను గొర్రెలు, మేకల పంపకందారులకు వివరించారు. ఇప్పటి వరకూ మండలంలో 10,874 గొర్రెలు, 2,682 మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందు వేశామన్నారు. పశుగణ సహాయకులు కె.రామకృష్ణ పాల్గొన్నారు.

అభయాంజనేయుని సేవలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ గురువారం దర్శించుకున్నారు. పెదపాడు మండలం అప్పనవీడు పరిధిలో శక్తి సదన్ పేరిట నిర్వహిస్తున్న మహిళల స్వయం ఉపాధి శిక్షణ, వసతి గృహాన్ని పరిశీలించేందుకు వెళ్తూ మార్గమధ్యంలో ఇక్కడ కొద్దిసేపు ఆగారు. ఆలయం వద్ద డాక్టర్ శైలజకు అర్చకులు వేదమంత్రోచ్చరణలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటం, తీర్థప్రసాదాలను అధికారులు, అర్చకులు అందజేశారు.

వైభవంగా శ్రీసత్యసాయి ప్రేమ రథయాత్ర



పెనమలూరులో రథయాత్ర నిర్వహిస్తున్న సేవా సమితి సభ్యులు

పెనమలూరు: మండల పరిధిలో శ్రీ సత్యసాయి ప్రేమ రథయాత్ర గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీసత్యసాయిసేవాసమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శ్రీసత్యసాయి రాబోయే శత జయంతి వేడుకల్లో భాగంగా గత 100 రోజులుగా వివిధ గృహాలలో నిర్వహించిన విశేష పూజలు, భజనల అనంతరం పెనమలూరు నుంచి యనమలకుదురు వరకు భక్తుల యాత్ర నిర్వహించారు. బాబా రథయాత్రలో పిల్లల కోలాటం, వేదమంత్రాల పఠనం, భజనలు శోభాయాత్ర సాగింది. జిల్లా శ్రీసత్యసాయి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.మోహన్‌రావు, రాష్ట్ర, జిల్లా పదాధికారులు, సమితి సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తల్లీ కుమార్తెపై వ్యక్తి దాడి

పెనమలూరు: మద్యం మత్తులో ఓ వ్యక్తి తల్లీ కూతురుపై దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం గతంలో గంగూరు గ్రామంలో ఉన్న పి.సుధ భర్తతో విభేదాల కారణంగా 10 ఏళ్ల క్రితం విడాకులు తీసుకుంది. ఆమెకు గత కొద్ది కాలంగా ఖాజాఆలీపాషాతో పరిచయం ఏర్పడింది. కాగా సుధా వణుకూరులో ఇల్లు కట్టుకుని కుమార్తెతో ఉంటోంది. కాగా ఖాజాఆలీపాషా మద్యం సేవించి సుధా ఇంటికి వెళ్లి ఘర్షణ పడి ఆమె, ఆమె కుమార్తెపై దాడి చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని, లేకుంటే జరిమానా విధిస్తామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సురేష్ హెచ్చరించారు. విజయవాడ రోడ్డులోని ఎస్‌బీఐ సెంటర్‌లో గురువారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను పరిశీలించారు. పట్టణంలోని ముఖ్య రహదారుల్లో అతి వేగంతో విచ్చలవిడిగా బైక్‌లు నడుపుతున్న యువకులకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ లేకుండా, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి జరిమానా విధించారు. ఏఎస్ఐలు కనకరాజు, ఇంకొల్లు సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం కోర్టు, పీఎస్‌కు హాజరైన వంశీమోహన్



కోర్టు నుంచి బయటకు వస్తున్న వంశీమోహన్

గన్నవరం: స్థానిక ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టుకు గురువారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ విచ్చేశారు. గతంలో ఆత్కూరు, గన్నవరం పీఎస్ పరిధిలోని నమోదైన కేసులకు సంబంధించి మంజూరైన బెయిల్స్‌కు సంబంధించి పత్రాలను ఆయన కోర్టులో సమర్పించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న వంశీమోహన్ హైకోర్టులో వచ్చిన బెయిల్స్‌కు సంబంధించి ష్యూరిటీలు సమర్పించారు. ఆయనను కలిసేందుకు, పరామర్శించేందుకు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు కోర్టుల ప్రాంగణం, పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. వీరందరిని అప్యాయంగా పలకరించిన ఆయన అనంతరం తేలప్రోలు బయలుదేరి వెళ్లారు. వంశీమోహన్‌తో పాటు ఆయన సతీమణి పంకజశ్రీ, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

గన్నవరం: క్షయ వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ముస్తాబాద పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుజనా సూచించారు. టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. రెండు వారాలకుపైగా దగ్గు, జ్వరం ఉండడం, కళ్లెలో రక్తం పడడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధిగా గుర్తించాలన్నారు. సమీపంలోని టీబీ సెంటర్‌కు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నియంత్రణకు అవసరమైన మందులు టీబీ సెంటర్లలో అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా కో ఆర్డినేటర్ చిన్నికృష్ణ, టీబీ సెంటర్ సిబ్బంది సాంబశివరావు, రఘు, రాధా సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ శాఖలో గిరిజన ప్రాంతాల అభివృద్ధి అధికారి పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాల నియామకం చేపడతామన్నారు. విద్యార్హత పోస్టు గ్రాడ్యుయేట్, ట్రైబల్ స్టడీస్ లేదా సోషియాలజీ, సోషల్‌వర్క్, ఆంత్రోపాలజీ(స్టడీ ఆఫ్ హ్యూమన్) పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లేదా రూరల్ డెవలప్‌మెంట్ ఉండాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఒక పోస్టు, జిల్లా స్థాయిలో నాలుగు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

గుణదల(విజయవాడతూర్పు): మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు మత్తు పదార్థాలను నిర్వీర్యం చేసే దిశగా సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈగెల్ ఐజీ ఎ.రవికృష్ణ అన్నారు. ఆంధ్ర లయోల కళాశాలలోని దేవయ్య ఆడిటోరియంలో గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డీసీపీ కేజీవీ సరిత మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా పాటుపడాలని తెలిపారు. గంజాయి రవాణా చేసే అసాంఘిక శక్తులపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపుతుందన్నారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఈగెల్ విభాగం ఎస్పీ నగేష్‌బాబు, లయోల కళాశాల రెక్టర్ ఫాదర్ పీఆర్ జాన్, ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్కియోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిరణ్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి జి.సహాయ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఖరీఫ్ పనులు

- దమ్ము పనుల్లో అన్నదాతలు
- సిద్ధమవుతున్న వరి నారుమడులు
- మొదలైన వరి నాట్లు





ఉప్పలూరులో సాగుతున్న వరి నాట్లు (ఇన్‌సెట్) పునాదిపాడులో ఏపుగా పెరిగిన వరి నారుమడి

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల వ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు కొనసాగుతున్నాయి. బోర్లు సదుపాయం ఉన్న భూముల్లో రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకున్నారు. వరి నారుమడులు రెడీ అవ్వటంతో రైతులు వరి నాట్లు పనుల్లో నిమగ్నమయ్యారు. ఇందుకు భూములను ముందుగానే దమ్ము చేసుకుని సాగుకు సన్నద్ధమవుతున్నారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ముందస్తుగా ఖరీఫ్ పనులు మొదలవుతున్నాయి. తొలకరి పలకరింపుతోనే రైతులు విత్తనాన్ని సమీకరించుకుని వరి నారుమడులు పోసుకున్నారు. పలువురు భూములను సిద్ధం చేసుకుని వరి నారుమడులను పోసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో పాటు భూములను దమ్ములు పూర్తి చేసి నాట్లకు సన్నద్ధం చేస్తున్నారు.

మొదలైన వరి నాట్లు..

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు మొదలయ్యాయి. గడిచిన రెండు రోజులుగా పలు ప్రాంతాల్లో నారు తీత, నాట్లు పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉంటున్నారు. బోర్లు సదుపాయం ఉన్న రైతులు పొలాలకు నీరు పెడుతున్నారు. కాలువ వెంబడి భూములు ఉన్న రైతులు సైతం కాలువలు, బోదెల్లో ఉన్న అడుగునీటిని ఆయిల్ ఇంజిన్ల సహాయంతో నీటిని పొలాలకు మళ్లిస్తున్నారు. ఇందుకు గానూ ఒక్కో రైతు ఎకరాకు రూ.5 వేలు వరకూ అదనపు పెట్టుబడులు సాగు మొదట్లోనే పెట్టాల్సి వచ్చింది. భారమైనా పొలాలు అదును తప్పకుండా చూసుకోవటానికి ఖర్చులు భరించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

వలస కూలీల రాక..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో స్థానిక కూలీలకు పోటీగా వలస కూలీలు అధికమయ్యారు. జిల్లాలోని దివిసీమ, గుంటూరు జిల్లా రేపల్లె, తెలంగాణ ప్రాంతాల నుంచి కూలీలు ఉపాధి కోసం రెండు నియోజకవర్గాలలోని పలు గ్రామాలకు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వేళ వరకూ కూలీలు పొలాల్లో వరి నారుతీత, నాట్లు పనుల్లో నిమగ్నమవుతున్నారు.